

సిరిపురం దత్ ఐలాండ్ సమీపంలో కాన్వాయ్ నుంచి దిగి రోడ్‌షో నిర్వహించేందుకు వెళ్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



సభా ప్రాంగణం వద్ద ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



ప్రధాని మోదీకి అరకు కాఫీ కిట్ అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. చిత్రంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.

విశాఖకు నవోదయం

సుమారు రెండు లక్షల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన రోజు



సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్

- రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం
- గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారనున్న విశాఖ
- ప్రధాని నరేంద్రమోదీ
- బల్క్‌డ్రగ్ పార్క్‌తో వస్తూత్పత్తి రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు
- నీలి విప్లవంతో ప్రాభవాన్ని చాటనున్న విశాఖ
- ఫిషింగ్ హార్బర్‌ను ఆధునికీకరిస్తున్నట్టు ప్రకటన
- విశాఖను ఆర్థిక రాజధానిగా మరోసారి ఉద్ఘాటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు



ఏయూ ఇంజనీరింగ్ గ్రౌండ్స్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఘట్టం బుధవారం ఆవిష్కృతమైంది. ఒకేరోజు రూ.2 లక్షల కోట్లకుపైగా ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ ఈ స్థాయి పెట్టుబడులకు సంబంధించిన కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించలేదు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ ప్రాధాన్యం గుర్తించిన కేంద్రం భారీగా నిధులు మంజూరుచేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సభా వేదికపై ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖ ప్రాధాన్యాన్ని మరోసారి గుర్తుచేశారు.

విద్యుత్ రంగంలో నూతన విప్లవానికి నాంది పలికిన హైడ్రోజన్ పవర్‌లో విశాఖ పట్నం అత్యంత కీలకంగా మారబోతోందని ప్రధానమంత్రి ప్రకటించారు. 2030 నాటికి దేశంలో రెండు చోట్ల ... మిగతా 8వ పేజీలో



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం తెలుపుతున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు శంకుస్థాపన

పూడిమడకలో తిలకించిన నాయకులు, ప్రజలు





పూడిమడక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రజలు (ఇన్‌సెట్‌లో) ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసి ఆవిష్కరించిన హైడ్రోజన్ గ్రీన్ హబ్ శిలాఫలకం

అచ్యుతాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక వద్ద ఏర్పాటు చేయనున్న ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పూడిమడక సమీపంలోని ఎన్‌టీపీసీ స్థలంలో వేదికను ఏర్పాటు చేసి, భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రభుత్వ శాఖలు, ఎన్టీపీసీ అధికారులతోపాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రధాని రోడ్ షో నుంచి బహిరంగ సభ ముగిసే వరకు ఆసాంతం తిలకించారు. మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడినప్పుడు ఇక్కడ చప్పట్లతో హర్షధ్వానాలు చేశారు. అయితే సాంకేతిక సమస్యల కారణంగా ప్రముఖుల ప్రసంగాలు సరిగా వినిపించలేదు. చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తున్నప్పుడు ఒక్కో మాట రెండేసిసార్లు వినపడడంతో కార్యకర్తలు అసహనం చెందారు. ఇక్కడ అధికారులు చేసిన ఏర్పాట్లుకన్నా ఎక్కువ మంది హాజరు కావడంతో కుర్చీలు ఖాళీ లేక పలువురు నిల్చుండి పోయారు. బహిరంగ సభ తరువాత భోజనం ప్యాకెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇన్‌చార్జి సుందరపు సతీశ్ కుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, ఎలమంచిలి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుకు శ్రీకారం

ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన

- రాజయ్యపేట వద్ద ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన నేతలు, అధికారులు





బల్క్ డ్రగ్ పార్కు వర్చువల్ శంకుస్థాపనను తిలకిస్తున్న కూటమి నేతలు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

నక్కపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్న బల్క్ డ్రగ్ పార్కుకు బుధవారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోదీ విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజలు, అధికారులు, నాయకులు ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రాజయ్యపేట-బోయపాడు రహదారి పక్కన భారీ టెంట్ వేసి ఎల్‌ఈడీ స్ర్కీన్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ జాహ్నవి, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ నరసింహమూర్తి, కూటమి నాయకులు తోట నగేశ్, పాకలపాటి రవిరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, కొప్పిశెట్టి కొండబాబు, కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి, శ్రీను, గింజాల లక్ష్మణరావు, వైబోయిన రమణ, పోలినాటి నానాజీ, కొప్పిశెట్టి శ్రీను, తోలేటి శ్రీను, తదితరులు హాజరయ్యారు.

బల్క్‌డ్రగ్ పార్క్‌కు వ్యతిరేకంగా ఆందోళన

పలు గ్రామాల్లో రైతులు, మత్స్యకారులు ధర్నా

- అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం



రాజయ్యపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మహిళలు


నక్కపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయొద్దంటూ చందనాడ, రాజయ్యపేట, అమలాపురం, బోయపాడు, తదితర గ్రామాల్లో రైతులు, మత్స్య కారులు ఆందోళనలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఆందోళన కారులు, సీపీఎం, వైసీపీ నాయకులు, బల్క్ డ్రగ్ పార్క్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేసే వేదిక వద్దకు రాకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. రాజయ్యపేట, చందనాడ, బుచ్చిరాజుపేట, అమలాపురం, వేంపాడు, చందనాడ, ఎన్.నర్సాపురం తదితర గ్రామాల్లో సీఐలు కుమారస్వామి, అప్పన్న, రామకృష్ణ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో ఆందోళనకారులు తమ గ్రామాల్లోనే నిరసనలు తెలిపారు. రాజయ్యపేటలో ఆందోళనకు దిగిన వారిని పోలీసులు అడ్డుకున్నారు. మత్స్యకార మహిళలు, పోలీసుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ప్రమాదకరమైన రసాయన పరిశ్రమలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే తమ భవిష్యత్తు నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అడ్డదారి గురువులపై యాక్షన్

'ఆంధ్రజ్యోతి' కథనానికి విద్యా శాఖ అధికారులు స్పందన

- నర్సీపట్నం మండలంలో ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు

నర్సీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 'గురువులు అడ్డదారి' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి విద్యా శాఖ అధికారులు స్పందించారు. నర్సీపట్నం మండలంలో ఎంపీపీ పాఠశాలల్లో పేర్లు నమోదు చేయించి, ప్రైవేటు స్కూళ్లలో తమ పిల్లలను చదివిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు చర్యలు చేపట్టారు. కొత్తబయపురెడ్డిపాలెం ఎంపీపీ స్కూల్ టీచర్ కె.సంధ్య, నగరం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయుడు జి.సూర్యప్రకాశ్‌కి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. కొంతమంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తూ, తాము పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాల రికార్డుల్లో పేర్లు నమోదు చేసినట్టు వచ్చిన ఫిర్యాదులపై డిప్యూటీ డీఈవో అప్పారావు ఈ నెల 6వ తేదీన విచారణ జరిపారు. అనంతరం నివేదికను డీఈవోకి అందజేశారు. దీనిపై సంజాయిషీ కోరుతూ కొత్తబయపురెడ్డిపాలెం, నగరం ఎంపీపీ పాఠశాలల టీచర్లు కె.సంధ్య, సూర్యప్రకాశ్‌లకు డీఈవో నోటీసులు జారీ చేశారు. ఎంఈవో బుధవారం తన కార్యాలయం సిబ్బందితో నోటీసులను సంబంధిత ఉపాధ్యాయులకు పంపారు. షోకాజ్ నోటీసులకు మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు.



Sub: - School Education – Children of Certain Govt School teachers Studying in Private unaided School but enrolled in Govt School – Show Cause Notice – Issued.

Ref: Enquiry report Dated: 06.01.2025 of Deputy Educational Officer, Yelamanchili, Anakapalli district.

-333-

In the reference cited, Deputy Educational Officer, Yelamanchili, Anakapalli district has submitted report stating that Children of Sri G. Surya Prakash, SGT, MPPS, Nagaram, Narsipatnam Mandal and Smt Sandhya, SGT, MPPS, K.B.Palem, Narsipatnam Mandal, Anakapalli district, Studying in Private unaided School but enrolled in Govt School .Thus, attracted Rule 3 of AP Conduct Rules, 1964.

In view of the above, Sri G. Surya Prakash, SGT, MPPS, Nagaram, Narsipatnam Mandal and Smt Sandhya, SGT, MPPS, K.B.Palem, Narsipatnam Mandal, Anakapalli district are hereby instructed to show cause within three days from the date of receipt of these proceedings so as to why disciplinary action shall not be initiated against them.

డీఈవో జారీ చేసిన షోకాజ్ నోటీసు

రోలుగుంట మండలంలో..

రోలుగుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కొంతమంది ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో పేర్లు ... మిగతా 8వ పేజీలో

బుద్ధుడుగా పాండురంగడు



పాయకరావుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పాండురంగస్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పాండురంగస్వామివారు బుద్ధుడుగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున స్వామివారికి సుప్రభాతసేవ, విశేష పూజల అనంతరం ప్రధానార్చకులు కృష్ణస్వామి పాండురంగస్వామిని బుద్ధుడిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శించుకున్నారు. సాయంత్రం బుద్ధుడి ప్రబోధనలపై ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె. దివ్యజ్యోతి, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

శేషతల్పంపై శ్రీహరి



నక్కపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ఇత్తడి శేషతల్ప వాహనంపై ఉపమాక వెంకన్న తిరువీధి సేవ ఘనంగా జరిగింది. ముందుగా ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇత్తడి శేషతల్ప వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి మూలవిరాట్ సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం అనంతరం శ్రీవారి సేవకులు అమ్మవారికి సామూహిక హారతులిచ్చారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

అచ్యుతాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పెదపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రైతులు కష్టపడి పండించే ధాన్యాన్ని స్వేచ్ఛగా అమ్ముకొనే హక్కు ఉండేది కాదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా సకాలంలో చెల్లింపులు కూడా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో శరగడం శివబాపునాయుడు, కోన లచ్చం నాయుడు, వ్యవసాయాధికారి శంకర గోవింద్, విస్తరణాధికారి కేబీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసైనికుని కుటుంబానికి ఆర్థిక సాయం

మునగపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన జనసేన పార్టీ నాయకుడు సుందరపు లక్ష్మణరావుకు జనసైనికులు నివాళులర్పించారు. మండలంలో వెంకటాపురంలో బుధవారం లక్ష్మణరావుకు సంతాప సభ నిర్వహించారు. నిరుపేద కుటుంబం కావడంతో జనసైనికులంతా సమకూర్చిన రూ.40వేలు మృతుడి కుటుంబానికి జనసేన గ్రామశాఖ అధ్యక్షురాలు సుందరపు ధనలక్ష్మి అందజేశారు.

తుప్పలు తొలగించిన మాజీ సర్పంచ్

రాంబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జడ్ చింతువా శివారు కొండవారపాలెం నుంచి ఎం. చింతువా గ్రామానికి మట్టి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను మాజీ సర్పంచ్ ఎరిపిల్లి చిట్టిబాబు బుధవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. వాహనాలతోపాటు పాదచారులు సైతం వెళ్ల లేని విధంగా తుప్పలు పెరిగిపోవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో చిట్టిబాబు తన సొంత నిధులతో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి తుప్పలను తొలగించారు. మాజీ సర్పంచ్ చిట్టిబాబును జడ్ చింతువా గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పిల్లి సహదేముడు పాల్గొన్నారు.

హిందీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత

అచ్యుతాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో నిర్వహించిన హిందీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారని హరిపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీపాద రవి తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన హిందీ నాగరీ బోర్డ్ నుంచి భూషణ్ పరీక్షల్లో 112 మంది విద్యార్థులు ఉత్తీర్ణత చెందారన్నారు. విద్యార్థులకు హిందీ పరీక్షల కేంద్రం వ్యవస్థాపకులు షేక్ బాషా, ధర్మిరెడ్డి రాజు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై ఐవోటీ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉపమాక గ్రామానికి చెందిన కొవ్వాడ ఆదినారాయణకు తీవ్రగాయాలయ్యాయి. ఐవోటీ వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి రాజమండ్రి వెళుతున్న మినీ వ్యాన్ ఢీకొట్టడంతో ఆదినారాయణకు తీవ్రగాయాలయ్యాయి. నక్కపల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం తుని ఆస్పత్రికి తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు చెప్పారు.

సస్యరక్షణతో అపరాలు అధిక దిగుబడి

పాయకరావుపేట రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అపరాల సాగులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని సత్యవరంలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వరి కోతలు తరువాత మినుము, పెసర పంటల సాగులో తీసుకోవలసిన జాగ్రత్తలు, సలహాలను అందించారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సఖిలేటి రాము, సిబ్బంది మౌనిష్, అమృత పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపులు

మునగపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో మేలుకొలుపులు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 16వ తేదీన మొదలైన వేడుకలు గ్రామాల్లో నిరాటంకంగా కొనసాగుతున్నాయి. భజనలు, కీర్తనలు ఆలపిస్తూ గ్రామ వీధుల్లో దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మునగపాక, వాడ్రాపల్లి, నాగులాపల్లి, చూచుకొండ, మూలపేట తదితర గ్రామాల్లో మేలుకొలుపు వేడుకలు జరుగుతున్నాయి.

ప్రధాని సభకు కూటమి శ్రేణులు

ఎలమంచిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖలో నిర్వహించిన ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహిరంగ సభకు కూటమి నేతలు, కార్యకర్తలు ఉత్సాహంతో తరలివెళ్లారు. బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందం, రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సోమలింగపాలెంలో జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అదేవిధంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు గ్రామీణ ప్రాంతాల్లోని టీడీపీ శ్రేణులతో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, కూటమి నేతలు బొద్దపు శ్రీను, కొఠారు సాంబ, ఝాన్సీ, రాజాన వెంకునాయుడు, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : విశాఖలో బుధవారం జరిగిన ప్రధాని నరేంద్రమోదీ ప్రజావేదిక సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి కూటమి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు తరలివెళ్లారు. సుమారు 30 బస్సుల్లో 2 వేల మందిని తరలించారు. హోం మంత్రి నివాసం వద్ద ఈ బస్సులకు ప్రత్తిపాడు శాసనసభ్యురాలు సత్యప్రభ జెండా ఊపి ప్రారంభించారు. ఆమెకు కూటమి నాయకులు ఘనస్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు.



నక్కపల్లిలో ప్రధాని సభకు వెళ్లే బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ



తెరువుపల్లి నుంచి వెళుతున్న కూటమి శ్రేణులు, కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందం, ఆర్‌డీసీ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు

ఇంటర్వ్యూ..

రోజూ 300 ఓపీ

కోటవురట్ల సీహెచ్‌సీ సూపరింటెండెంట్ ప్రసాద్



ప్ర: రోజూ ఓపీకి ఎంతమంది రోగులు వస్తున్నారు?

జ: ప్రతిరోజూ సీహెచ్‌సీకి ఓపీకి 300 మంది వస్తున్నారు. వారిలో 40 నుంచి 45 మంది ఇన్‌పేషెంట్స్ ఉంటున్నారు. సీజనల్ వ్యాధుల రోగులతో మంచాలు పూర్తిగా నిండిపోయాయి.

ప్ర: మందుల కొరత ఉందా?

జ: ప్రస్తుతానికి అన్ని రోగాలకు మందులు అందుబాటులో ఉన్నాయి. కొరత లేదు.

ప్ర: ఆస్పత్రిలో డాకర్ల కొరత ఉందా?

జ: జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ప్ర: ఇన్‌పేషెంట్‌లకు భోజనం సదుపాయం ఉందా?

జ: వారికి భోజనం సదుపాయం కల్పిస్తున్నాం

ప్ర: ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత ఏమైనా ఉంది?

జ: ఓటీ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పోస్టులు ఖాళీలు ఉన్నాయి.

ప్ర: సీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల లక్ష్యం ఎంత?

జ: ఆస్పత్రిలో నెలకు 50 ఆపరేషన్లు లక్ష్యం కాగా ప్రతినెల 40 నుంచి 45 వరకు చేస్తున్నాం. ఒకొక్క నెల లక్ష్యం పూర్తవుతున్నాయి.

వైసీపీ నేతల ముందస్తు అరెస్టు, విడుదల

నక్కపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కుకు బుధవారం సాయంత్రం దేశ ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ శంకుస్థాపన చేశారు. ఇందుకు సంబంధించి స్థానికంగా ప్రతిపక్ష, వామపక్ష పార్టీల నుంచి ఎటువంటి నిరసనలు ఎదురవ్వకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, వైసీపీ నాయకులు సూరకాసుల గోవింద్, గంటా తిరుపతిరావు, తళ్లాభార్గవ్‌లను ఉదయం అరెస్టు చేసి మధ్యాహ్నం వరకూ నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో వుంచారు. మధ్యాహ్నం పాయకరావుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బల్క్‌డ్రగ్ పార్కు వర్చువల్ శంకుస్థాపన పూర్తయిన తరువాత వీరిని విడిచి పెట్టారు.



నక్కపల్లి: వైసీపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేసిన దృశ్యం

వైసీపీ నేతల సంఘీభావం

పాయకరావుపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించిన నక్కపల్లి మండలం వైసీపీ సీనియర్ నాయకులు వీసం రామకృష్ణను వైసీపీ నాయకులు కలిసి సంఘీభావం తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి, నాయకులు ఇసరపు తాతారావు, జగతా శ్రీను, గెడ్డమూరి శ్రీనివాసరావు, దేవవరపు రాజేష్‌ఖన్నా తదితరులు ఉన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న బాలికలు

నక్కపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట వద్ద బల్క్ డ్రగ్ పార్కు వర్చువల్ శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై బుధవారం సాయంత్రం పలువురు బాలికలు చేసిన నృత్యకోలాట ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ప్రధాని మోదీ విశాఖ నుంచి నక్కపల్లి బల్క్‌డ్రగ్ పార్కుకు వర్చువల్ శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో బాలికల నృత్యప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

గృహ నిర్బంధంపై సీపీఎం నేతల నిరసన

ఎస్.రాయవరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజును పోలీసులు బుధవారం కూడా గృహ నిర్బంధంలోనే ఉంచారు. దీంతో ఆయన స్వగృహంలోనే పలువురితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్న సీపీఎం నాయకులను గృహ నిర్బంధం, అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. నక్కపల్లి మండలంలో ప్రజల ప్రాణాలకు హాని కలిగించే బల్క్ డ్రగ్స్ వంటి కంపెనీను ఏర్పాటు చేయొద్దంటూ అప్పలరాజు డిమాండ్ చేశారు. అలాగే నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్స్ కంపెనీ వద్దంటూ ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ, రాజేష్, మండల నాయకులను పోలీసులు అరెస్టు చేసి ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

రాంబిల్లి: విశాఖపట్నంలో బహిరంగ సభకు దేశ ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వస్తున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా సీపీఎం నేతలను నిర్బంధించడం అన్యాయమంటూ ఆ పార్టీ నాయకులు బుధవారం ఇక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. కాకినాడలో తిరస్కరించిన బల్క్‌డ్రగ్స్‌ను నక్కపల్లిలో ఎందుకు నెలకొల్పుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పూడిమడక ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పవర్‌ప్లాంట్‌లో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



ధర్మవరం అగ్రహారంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

ముమ్మరంగా కోళ్లకు వ్యాక్సినేషన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్టు

కోటవురట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా నాటుకోళ్లు, పందెం కోళ్లకు పశుసంవర్థక శాఖ అధికారులు వ్యాక్సినేషన్ చేశారు. ఈనెల ఆరో తేదీన 'ఆంధ్రజ్యోతి'లో 'వైరస్‌తో పందెంకోళ్లు విలవిల' శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కోటవురట్ల పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెట్ల నరేష్ రెండు రోజుల నుంచి పల్లెల్లో నాటుకోళ్లు, పందెం కోళ్లకు వ్యాక్సిన్ వేస్తున్నారు. ఈనెల 31వ తేదీ వరకు ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నట్టు ఏడీ పెట్ల నరేష్ తెలిపారు.



చౌడువాడలో కోడికి వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

దట్టంగా కురుస్తున్న మంచు

కోటవురట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంచు దట్టంగా కురుస్తోంది. బుధవారం ఉదయం 9 గంటలైనా మంచు వీడలేదు. మంచుతో విద్యార్థులు, కూలీలు ఇబ్బంది పడుతున్నారు. కూలీలు స్వెటర్లు ధరిస్తున్నారు. లైట్లు వేసుకొని వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు మంచు కారణం కనిపించడం లేదని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. చలి తీవ్రతకు చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు.



అన్న క్యాంటీన్‌లో అల్పాహారం నాణ్యత పరిశీలన

ఎలమంచిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):స్థానిక అన్న క్యాంటీన్ నిర్వహణను బుధవారం డీఎల్‌డీఓ నాగలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు పరిశీలించారు. ఉదయం అల్పాహారం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంటీన్‌లో పలు విభాగాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పేదలకు రూ.5లకే రుచికరమైన అల్పాహారం, భోజనం వేర్వేరుగా అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఏఈ గణపతి సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో అల్పాహారాన్ని రుచి చూస్తున్న డీఎల్‌డీఓ నాగలక్ష్మి, కమిషనర్ ప్రసాదరాజు

సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ జిల్లా నాయకుడు నాగభూషణం డిమాండ్

పాయకరావుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ జిల్లా నాయకులు పి.నాగభూషణం డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు బుధవారం స్థానిక పీఏసీఎస్ ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ సొసైటీ ఉద్యోగులకు హెచ్‌ఆర్. పాలసీపై 2019 మార్చిలో జీవో నం.36 విడుదల చేసినప్పటికీ ఇప్పటివరకు అమలుకు నోచుకోలేదన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ అమలుతోపాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడమన్నారు. ఇందులో భాగంగా గురువారం నుంచి అన్ని కంప్యూటర్ వర్క్‌లు నిలుపుదల, ఈనెల 10 డీసీసీబీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా, ఈనెల 20న అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా, 27న విజయవాడలోని రాష్ట్ర సహకార బ్యాంకు ఎదుట ఉద్యోగులతో మహా ధర్నా చేయడం జరుగుతుంన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే ఫిబ్రవరి 2వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు పణీంద్ర, సూరిబాబు, పాపారావు పాల్గొన్నారు.



పీఏసీఎస్ ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చందన అలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి

ఎస్.రాయవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి చందనం పూశారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



గంగాదేవిపేటలో దోమల నివారణ చర్యలు

మునగపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంగాదేవిపేటలో దోమల నివారణ చర్యలు చేపట్టడం జరిగిందని మూలపేట ఉపసర్పంచ్ మొల్లేటి దేవిచంద్ర తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించడంతో పాటు పారిశుధ్య పనులను బుధవారం చేపట్టామన్నారు. రామాలయంలో జరిగిన 104 వైద్య శిబిరాన్ని పరిశీలించారు.

కొండెంపూడి కేవీకేకి ఉత్తమ అవార్డు

విస్తరణ, సేవల విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం

రావికమతం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం కొండెంపూడిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి విస్తరణ, సేవల విభాగంలో రాష్ట్రస్థాయిలో అవార్డు లభించింది. గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి చేతుల మీదుగా కొండెంపూడి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్ అవార్డును అందుకున్నారు. తమ కేవీకే రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక కావడానికి శాస్త్రవేత్తలు ఎన్.సత్తిబాబు, ఎ.సౌజన్య, ఎన్.కిశోర్, పి.బాబు, పీవీఎస్ రామునాయుడు, వైస్రవంతి కృషి ఎంతో ఉందని అన్నారు.



ఉత్తమ అవార్డు అందుకుంటున్న కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్

'ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఎలమంచిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ దేముడు కోరారు. బుధవారం ఎలమంచిలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసే మినుములు, పెసలు సాగు చేసే రైతులు పీఏఏల ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు.



ఎలమంచిలిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సూచనలు ఇస్తున్న ఏఈఓ దేముడు

దళిత బిడ్డల భరోసాకు రూ.350 కోట్లు మంజూరు

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం

మునగపాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దళిత బిడ్డల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో మూలకు చేరిన దళితుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కోరామన్నారు. దళిత బిడ్డలను అన్ని విధాలుగా ఆదుకోవడం కోసం ప్రభుత్వం రూ.350 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఎన్ఎస్ఎఫ్‌డీసీ, కేఎస్ఎఫ్‌డీసీ రుణాలు, ఆటో, రిక్షా, ఇన్నోవా కార్లు కొనుగోలుతోపాటు నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు.



మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ శ్రీదేవికి బొకే ఇస్తున్న డైరెక్టర్ నాగభూషణం

మాజీ కో-ఆప్షన్ సభ్యురాలు లక్ష్మికి ఘన నివాళి

ఎస్.రాయవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సైతారుపేటలో ఇటీవల మృతి చెందిన బోయిన లక్ష్మికి బుధవారం నిర్వహించిన సంతాప సభలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు యూవీ రమణమూర్తిరాజు(కన్నబాబు), కంబాల జోగులు, జనసేన నాయకులు తోట నగేష్, ఎలమంచిలి మాజీ ఎంపీపీ బొద్దపు ఎర్రయ్యదొర తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈమె కో-ఆప్షన్ సభ్యురాలు, కాంగ్రెస్, వైసీపీల్లో వివిధ పదవులను నిర్వహించారు.



లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు, తదితర నాయకులు

ధాన్యం విక్రయించిన మరుసటి రోజే నగదు జమ

ఎలమంచిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం నగదు 24 గంటలు తిరగక ముందే తన బ్యాంకు ఖాతాలో జమ కావడం పట్ల పట్టణానికి చెందిన రైతు ఆడారి రమణబాబు ఆనందం వ్యక్తం చేశారు. ఎలమంచిలి కొక్కిరాపల్లి సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం రెండున్నర టన్నులు ధాన్యం విక్రయించగా శనివారం తన బ్యాంకు ఖాతాలో నగదు రూ.57,960 జమ అయ్యాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేతల ద్వారా నిరూపించుకుందని వారు కొనియాడారు. రైతులందరూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని ఆమె కోరారు.



ఉత్సవ రాట పూజా కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేశ్

మకరజ్యోతి ఉత్సవాలు జయప్రదం చేయండి

నర్సీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మకర జ్యోతి ఉత్సవాలను విజయవంతం చేయాలని 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ కోరారు. బుధవారం ఆలయం వద్ద రాజేశ్ దంపతులు ఉత్సవ రాట వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మకరజ్యోతి ఉత్సవాలలో భాగంగా 13 నుంచి 15 వరకు ప్రత్యేక పూజలు, స్టేడియంలో వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, జాలమూరి బంగార్రాజు, రాజ్‌కుమార్, కుప్పిలి స్వామి పాల్గొన్నారు.

ప్రధాని సభకు 80 బస్సుల్లో జనం తరలింపు

నర్సీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి 80 బస్సుల్లో జనాలను తరలించారు. వీటిలో డిపోలో ఆర్టీసీ బస్సులు 74, అద్దెబస్సులు 26 ఉన్నాయి. వాటిలో 65 ఆర్టీసీ బస్సులు, 15 అద్దె బస్సులను బుధవారం ప్రధాన మోదీ సభకు జనాలను తరలించడానికి పంపించారు. తుని, కృష్ణాదేవిపేట, చింతపల్లి, విశాఖపట్నం, చోడవరం, అడ్డురోడ్డు రూట్లులో ఒకట్రెండు బస్సులు నామమాత్రంగా తిప్పారు. దీంతో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి కాంప్లెక్స్‌లో నిరీక్షించాల్సి వచ్చింది. ఎంతకీ బస్సులు రాకపోవడంతో ఆటోలు, కార్లను ఆశ్రయించి ప్రజలు గమ్యస్థానాలు చేరుకున్నారు.

రెండు గ్రామాల్లో తాగునీటి బోర్లు

గొలుగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం రెండు తాగునీటి బోర్లు నిర్మించారు. చీడిగుమ్మల శివారు ఎరకంపేట గ్రామంలో జడ్పీ నిధులతో సర్పంచ్ చినబ్బాయి, గొలుగొండ రెల్లి కాలనీలో గ్రామ పంచాయతీ సాధారణ నిధులతో స్థానిక సర్పంచ్ కసిపల్లి చినప్పారావు, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంఘ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేశ్, టీడీపీ నేత గండేపల్లి రాము బోర్ల పనులను ప్రారంభించారు. దీంతో తాగునీటి సమస్య తీరుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభించిన దాడి జయవీర్

అనకాపల్లి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపీ సీఎం రమేశ్ సొంత నిధులతో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సీఎం రమేశ్ కప్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను టీడీపీ నాయకుడు దాడి జయవీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జయవీర్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేత జట్టుకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్, క్రికెట్ క్రీడాకారులు సతీశ్, జగదీశ్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

కొండెంపూడి కేవీకేకి అవార్డు

» విస్తరణ, సేవల విభాగంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం

» ఎన్జీ రంగా అగ్రి వర్సిటీ వీసీ చేతుల మీదుగా అందుకున్న శాస్త్రవేత్త రాజ్‌కుమార్

రావికమతం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలం కొండెంపూడిలోని కృషి విజ్ఞాన కేంద్రానికి విస్తరణ, సేవల విభాగంలో రాష్ట్రస్థాయిలో అవార్డు లభించింది. గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి చేతుల మీదుగా కొండెంపూడి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్ అవార్డును అందుకున్నారు. ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయంపై నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ అధిక పంట దిగుబడులు సాధించడానికి శాస్త్రవేత్తలు కృషిచేస్తున్నారు. కొత్త రకం వంగడాలను చేరువ చేస్తున్నారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, మెలకువలు, సలహాలను రైతులకు ఎప్పటికప్పుడు అందిస్తున్నారు.





ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకుంటున్న కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజ్‌కుమార్ (ఇన్‌సెట్‌లో) డాక్టర్ రాజ్‌కుమార్

దీంతో విస్తరణ, సేవల విభాగంలో రాష్ట్రంలోని అన్ని కేవీకేల్లో కొండెంపూడి కేంద్రం మొదటి స్థానంలో నిలిచి, అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లాలో 20 మండలాల రైతులకు తమ కేంద్రం ద్వారా పలురకాల సేవలు అందిస్తున్నామని చెప్పారు. వరి విత్తనోత్పత్తి చేపట్టి రైతులకు నాణ్యమైన ఫౌండేషన్ విత్తనాన్ని సరఫరా చేస్తున్నామని, ఇంకా రాగి, నువ్వు, కొర్ర విత్తనాలు, చెరకు ఒంటికన్ను ముచ్చు నారును రైతులకు అందిస్తున్నామని చెప్పారు. 2023-24లో మూడు లక్షల జీడిమామిడి, బొప్పాయి, సపోటా, జామ, చింత, సీతాఫలం మొక్కలను రైతులకు అందజేసినట్టు చెప్పారు. తమ కేవీకే రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడానికి శాస్త్రవేత్తలు సత్తిబాబు, ఎ.సౌజన్య, ఎన్.కిశోర్, పి.బాబు, పీవీఎస్ రామునాయుడు, వై.స్రవంతి కృషి ఎంతో ఉందని అన్నారు.

కొత్తజోగంపేట శ్మశానవాటికకు రోడ్డు మంజూరు

గొలుగొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలుగొండ గ్రామ పంచాయతీ శివారు కొత్తజోగంపేట గ్రామంలో శ్మశాన వాటికకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని బీజేపీ నాయకుడు గాదె శ్రీనివాసరావు తెలిపారు. ఈ రోడ్డు సమస్యను అనకాపల్లి పార్లమెంట్ సభ్యుడు సీఎం.రమేశ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని చెప్పారు. దీంతో బుధవారం ఏపీఎస్‌పీసీఆర్ఐసీ జేఈ కోటీశ్వరరావు ఈ రోడ్డు నిర్మాణానికి కొలతలు తీశారు. ఫిబ్రవరి తొలి వారంలో అనుమతులు వచ్చిన వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

కాలువ మరమ్మతు పనులకు ప్రతిపాదనలు

మాకవరపాలెం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువ మరమ్మతు పనుల కోసం రూ.70 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఇరిగేషన్ జేఈ రామన్నపాత్రుడు తెలిపారు. జి.కోడూరు గ్రామంలో జాగారాల గెడ్డ నీటి ఉధృతికి కోట్టుకుపోయిన వంతెన, సాగునీటి కాలువను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వచ్చే ఖరీఫ్ నాటికి సాగునీటి కాలువల మరమ్మతు పనులు పూర్తిచేస్తామని చెప్పారు. సాగునీటి సంఘం డైరెక్టర్లు, రైతులు మరమ్మతులకు గురైన కాలువలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జి.కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు కల్యాణ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

నర్సీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1977-78 పదో తరగతి, 1978-80 సంవత్సరంలో ఇంటర్ చదువుకున్న పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏపీఎన్.మూర్తి, కార్యదర్శిగా అచ్చుతము, కోశాధికారిగా కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ప్రకాశరావు, ఉప కార్యదర్శిగా జీడీ.ప్రసాద్‌తో పాటు తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రవాసాంధ్రుల క్రీడా పోటీలు అభినందనీయం

నాతవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వారం రోజుల పాటు ప్రవాసాంధ్రుల కేఎస్ఆర్ టీమ్ సభ్యులు నియోజకవర్గ స్థాయి క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎంపీపీ పి.కొండబాబు పేర్కొన్నారు. బుధవారం క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నీలో 32 జట్లు పాల్గొంటున్నాయన్నారు. అందరూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఎస్.విజయ్‌కుమార్, పైల పోతురాజు, శెట్టి నానాజీ, బి.సూరిబాబు, సత్యనారాయణ, ఎ.యర్రాపాత్రుడు, సీతారామ్మూర్తి, సిహెచ్.శ్రీనివాసు, శెట్టి లోవ, నానాజీ, గోపీ, దాసు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే చిన్నారులకు ఆరోగ్యం



చిన్నారులతో ముచ్చటిస్తున్న ఆర్జేడీ చిన్మయిదేవి

కృష్ణాదేవిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పోష కాహారంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి. చిన్మయిదేవి చెప్పారు. గొలుగొండ సీడీపీవో కార్యాలయాన్ని బుధవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పీవో శ్రీగౌరీ, సూపర్‌వైజర్లు, సిబ్బందికి సూచనలు అందించారు. అనంతరం ఏఎల్‌పురం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీలు చేశారు. చిన్నారులతో ముచ్చటించి పౌష్టికాహారంపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ లబ్ధిదారులంతా ఆధార్ అనుసంధానం చేయాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టిహకాహారం వచ్చిన వెంటనే నాణ్యత పరిశీలించి ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్లు కేంద్రాలను తరచూ పరిశీలించి సిబ్బంది సమయంపాలన పాటించేలా చర్యలుత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.సత్యశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు మంగ, ధనలక్ష్మి, రాజకుమారి పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడ్డ సర్పంచ్‌పై చర్యలు తీసుకోండి



రామాలయం చూపుతున్న టీడీపీ నాయకులు

కృష్ణాదేవిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధి పనులు, రామాలయం నిర్మాణం పేరుతో రూ.10 లక్షలు అవినీతికి పాల్పడ్డ సీహెచ్‌నాగాపురం సర్పంచ్ వైఆర్.చంద్రరావుపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ కె.రామారావు, టీడీపీ నేత బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. నాగాపురంలో నిర్మిస్తున్న రామాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకర్లతో వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.5 లక్షలతో పాటు దాతలు మరో రూ.7 లక్షలు ఇచ్చారని, వాటిలో రూ.5 లక్షలు మాత్రమే ఖర్చు చేశారని ఆరోపించారు. మిగిలిన రూ.7 లక్షలకు సర్పంచ్ అవకతవకలకు పాల్పడ్డారని, గ్రామస్థులు వివరాలు అడిగినా సర్పంచ్ లేదనేవారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.జగ్గయ్యదొర, బి.ప్రసాద్, ఎస్.వరహాలబాబు, డివెంకటేశ్వరరావు, పి.సత్యనారాయణ, కె.రామారావు, కె.నాగేశ్వరరావు, సూరిబాబు, వెంకరమణ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ఉపాధ్యాయులు తప్పు చేస్తే తప్పించుకోలేరు

డీఈవో గిడ్డి అప్పారావునాయుడు



ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తూ ప్రభుత్వం బడుల్లో తమ పిల్లల పేర్లు నమోదు చేయడం నేరం. దీనివల్ల పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంది. ఈ విషయంలో తప్పు చేసిన ఉపాధ్యాయులు ఎవరూ తప్పించుకోలేరు.

ప్ర: ప్రభుత్వ పాఠశాలలో పేర్లు నమోదు చేసి ప్రైవేటు పాఠశాలలో తమ పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయులకు ఎంత మందికి నోటీసులు ఇచ్చారు ?

జ: నర్సీపట్నం మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. మిగిలిన మండలాల్లో కూడా ఎంఈవోలతో విచారణ చేస్తున్నాం. అందరికీ నోటీసులు వెళ్తాయి.

ప్ర: వీరిపై ఏ విధమైన చర్యలు తీసుకుంటారు?

జ: ప్రభుత్వానికి, డిపార్ట్‌మెంట్‌కి చెడ్డ పేరు తీసుకు రావడం జరిగింది. బాధ్యులపై శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. సస్పెండ్ చేయడంతో విడిచి పెట్టం.

ప్ర: ఈ విధంగా చేయడం వలన పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంది? దీనికి మీ సమాధానం?

జ: కచ్చితంగా, నిజాయితీగా ప్రభుత్వ స్కూళ్లలో ఉండి చదువుతున్న పేద విద్యార్థికి చాలా పెద్ద నష్టం జరుగుతుంది. ప్రైవేటు స్కూళ్లలో చదివించడం వల్ల నవోదయా ప్రవేశాలలో ఆ విద్యార్థులకే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. గ్రామీణ ప్రభుత్వ బడిలో చదువుతున్న విద్యార్థికి చాలా నష్టం జరుగుతుంది.

ప్ర: విషయం బటకు వచ్చిన తర్వాత ఉపాధ్యాయుల పిల్లల పేర్లు ఆన్‌లైన్‌లో తప్పిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి ?

జ: విచారణలో అన్ని విషయాలు బయటకు వస్తాయి. ఇప్పటికే నవోదయ ఎంట్రన్స్‌కి దరఖాస్తు చేసి ఉన్నారు. దీని ఆధారంగా కూడా విచారణ చేస్తాం. తప్పు చేసిన వారు తప్పించుకోలేరు.

ప్ర: ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారా ?

జ: ఆర్‌జేడీ, కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లాం. దీన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాం.

-నర్సీపట్నం

పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికిన రాజు



చోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనకు వచ్చిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను నియోజకవర్గ జనసేన ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మోదీ సభకు జన సమీకరణ గురించి ఆయన వివరించారు.

బెన్నవోలులో మేలుకొలుపు

చోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెన్నవోలులో బుధవారం తెల్లవారుజామున మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తులు నగర సంకీర్తన చేపట్టారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీడీపీ నాయకుడు మజ్జి గౌరీశంకర్, శానాపతి అప్పలనాయుడు, మాణిక్యం, సన్యాసిరావు పాల్గొన్నారు.

'వంద రోజుల ప్లాన్ పక్కాగా అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ జాన్‌ప్రసాద్

రోలుగుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత పాఠశాలల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను పక్కాగా అమలు చేయాని ఎంఈఓ జాన్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కేజీబీవీ, కొవ్వూరు జడ్పీ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ వంద రోజులు ఒత్తిడిని అధిగమించి, కష్టపడి అన్ని సబ్జెక్టుల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. ప్రతీ సబ్జెక్టులో తెలియని విషయాలను టీచర్లను అడిగి తెలుసుకుని ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఫోర్‌మెన్ కమిటీ సభ్యులు రమేష్‌కుమార్, శేఖర్, మోహన్‌రావు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఆహార ఉత్పత్తుల అమ్మకాలు



వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువులతో పండించిన ఆహార ఉత్పత్తులకు మాడుగులలో మంచి స్పందన లభిస్తోంది. బుధవారం స్థానిక దేవి అమ్మవారి ఆలయం ఎదురుగా గ్రామస్థుల సహకారంతో ప్రకృతి వ్యవసాయం విధానంలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, దుంప జాతి, పండ్ల జాతి ఉత్పత్తులు, చిరుధాన్యాలు, అన్నిరకాల విత్తనాలు, కషాయాలు, అమృతాలు విక్రయించారు. ఏవో ఎం.వాసుదేవరావు మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతుల్లో పండించిన పంటలతో ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, మండల ఇన్‌చార్జి గండి శ్రీనివాసరావు, బి.దేవి, కొండాజీ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

మోదీ సభకు తరలిన కూటమి శ్రేణులు

చోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ సభకు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి. స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం నుంచి మండలాల వారీగా కార్యకర్తలను విశాఖ సభకు సమీకరించే పనిలో కూటమి నేతలు నిమగ్నమయ్యారు. టీడీపీ పరిశీలకుడు మూర్తియాదవ్, కూటమి నేతలు మల్లునాయుడు, పెదబాబు, దేవరపల్లి బొడ్డేడ నాగగంగాధర్, దేవరపల్లి వెంకట అప్పారావు, పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో,సిరిపురపు రమేష్, గూనూరు మూలినాయుడు, అల్లం రామప్పారావు, కర్రి రమేష్, కందర్ప రమణమూర్తి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు విశాఖ బయలుదేరి వెళ్లారు.



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

ఘనంగా లక్ష్మణరావు విగ్రహావిష్కరణ



బండారు లక్ష్మణరావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొండుపాలెంలో బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు బండారు లక్ష్మణరావు సంస్మరణ సభ ఆయన స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణరావు విగ్రహాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మణ్ ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధి కోసం పాటుపడేవారన్నారు. ఆయన ఆశయాల సాధనకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జానకిరాంపురం సొసైటీలో అవకతవకలపై సెక్షన్ 51 కింద విచారణకు ఆదేశాలు

రోలుగుంట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలు నిగ్గు తేల్చేందుకు సెక్షన్ 51 కింద విచారణ నిర్వహించాలని ఆ శాఖ డిప్యూటీ రిజిస్ట్రర్ ప్రేమ స్వరూప రాణి ఉత్తర్వులు జరీ చేశారు. మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అవినీతి ,అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కుసర్లపూడికి చెందిన కిల్లాడ సాంభమూర్తి, గొల్లు నారాయణరావు మరో 40 మంది రైతులు పలు మార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సెక్షన్ 51 కింద సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని, ఇద్దరు విచారణ అధికారులను నియమించినట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దివ్యాంగులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక



దివ్యాంగుడి నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్య నిపుణులు

చీడికాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దివ్యంగ పింఛన్‌దారుల వివరాలను జిల్లా కలెక్టర్‌కి నివేదిస్తామని విశాఖ కేజీహెచ్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జగన్నాథరావు తెలిపారు. మండలంలో ఏడు గ్రామ సచివాలయాల పరిధిలో రూ.15 వేలు పింఛన్ తీసుకొంటున్న 19 మందిని బుధవారం వారు పరిశీలించారు. కోనాం సచివాలయ పరిధిలో ముగ్గురు. చీడికాడలో నలుగురు, అప్పలరాజుపురంలో ఐదుగురు, తురువోలులో ముగ్గురు, అర్జునగిరి, బైలపూడి సచివాలయాల పరిధిలో ఒకొక్కరి చొప్పున సర్టిఫికెట్‌లను స్వయంగా డాక్టర్లు వెరిఫికేషన్ చేశారు. ఈ నివేదికను జిల్లా కలెక్టర్‌కి అందజేస్తామన్నారు. వారితోపాటు చీడికాడ, పెదగోగాడ వైద్యాధికారులు డా.సునీల్‌కుమార్, కిలపర్తి ఉషాచైతన్య, సచివాలయ, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు ధర్మశ్రీ పరామర్శ



మాజీ సర్పంచ్ చీపురుపల్లి వెంకునాయుడును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మశ్రీ

రోలుగుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట మాజీ సర్పంచ్ చీపురుపల్లి వెంకునాయుడును బుధవారం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పరామర్శించారు. ఇటీవల ప్రమాదానికి గురైన వెంకునాయుడు చికిత్స పొంది ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ధర్మశ్రీతోపాటు ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, తమరాన వెంకటరమణ, దోశపత్ని రాజు పరామర్శించారు.

తురకలపూడిలో వెయ్యి లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం



బెల్లం పులుసు ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బుచ్చెయ్యపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకలపూడి, గొర్లెపాలెంలలో బుధవారం చోడవరం ఎక్సైజ్ సీఐ కేవీ.పాపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తురకలపూడిలో 400 లీటర్ల బెల్లం పులుసు, గొర్లెపాలెంలో 600 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అనకాపల్లి, చోడవరం, అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో కాశీపురం విద్యార్థుల ప్రతిభ

దేవరాపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీన రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో కాశీపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బండారు జస్వంత్, నూలు లోకేష్ బృందానికి తృతీయ స్థానం లభించింది. వీరికి జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ జాయింట్ డైరెక్టర్ జ్యోతికుమారి, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ప్రశంసా పత్రం అందజేశారని హెచ్‌ఎం బీటీ. సుందరి తెలిపారు. వారికి తర్ఫీదు ఇచ్చిన కొటాన రాంబాబు, ఎంఈఓ పడాల్ దాస్ అభినందించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న పీవీఆర్ యువసేన

దేవరాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొత్తపల్లికి చెందిన ముత్తంశెట్టి సన్యాసిరావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో స్నేహితులు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. సన్యాసిరావు భార్య ఉమామహేశ్వరీకి పీవీఆర్ యువసేన సమకూర్చిన రూ.1.5 లక్షలను మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పెంటారావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకున్న పీవీఆర్ యువసేన సభ్యులను కిలపర్తి భాస్కరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీవీఆర్ యువ సేన అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, తాతయ్యలు పాల్గొన్నారు.

'సీపీఎం నేతలను గృహ నిర్బంధం చేయడం అన్యాయం'



నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

దేవరాపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభకు వెళ్లకుండా ముందుగా సీపీఎం నాయకులను గృహ నిర్బంధం చేయడం అన్యాయమని ఆ పార్టీ మండల కార్యదర్శి బీటీ.దొర అన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగానికి అడ్డు తగులుతారని ముందస్తుగా గృహ నిర్బంధం చేశారన్నారు. ప్రజా ఉద్యమాలను ఎవరూ ఆపలేరన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పాల్గొన్నారు.

కౌమారదశ బాలికలకు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ



మాట్లాడుతున్న ఆదివాసీ నేతలు

గూడెంకొత్తవీధి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాఠశాలను మధ్యలో విడిచిపెట్టిన కౌమారదశ బాలికలకు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ ఇస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి డాక్టర్ పి. రోషిణి తెలిపారు. బుధవారం స్థానిక సీడీపీవో ఎ. లక్ష్మీదేవి ఆధ్వర్యంలో కౌమార దశ బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 402 మంది మధ్యలో పాఠశాలలను మానేసిన బాలికలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ బాలికలకు స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న రంగంలో నైపుణ్య శిక్షణ అందజేస్తామన్నారు. సీడీపీవో మాట్లాడుతూ.. బాలికలు బాల్య వివాహాలు చేసుకోరాదన్నారు. బలవంతంగా వివాహం చేసేందుకు ప్రయత్నిస్తే మహిళా కానిస్టేబుల్, ఐసీడీఎస్ ఉద్యోగులను సంప్రదించాలన్నారు.

కాఫీ గింజలు కొనుగోలు ప్రారంభం



రైతుకి చెక్కు అందజేస్తున్న డీఎం దేవరాజు

చింతపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో కాఫీ గింజలు కొనుగోళ్లు ప్రారంభించినట్టు గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు తెలిపారు. బుధవారం లంబసింగిలో జీసీసీ అధికారులు కాఫీ గింజలను కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీసీసీ ద్వారా గిరిజన రైతులకు గరిష్ఠ ధరలు అందిస్తున్నామన్నారు. కిలో పార్చ్‌మెంట్ రూ.320, చెర్రీ(గుల్ల) రూ.170, రొబస్టా రూ.100కు కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. కొనుగోలు చేసిన వెంటనే రైతులకు నగదును అందజేస్తున్నామన్నారు. కచ్చితమైన తూనిక ద్వారా గింజలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రైవేటు వర్తకులు తూనికల్లో మోసాలు చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సేల్స్‌మన్, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామారావు, ప్రధాన కార్యదర్శి నెహ్రూబాబు, కాంట్రాక్టు సేల్స్‌మెన్లు పాల్గొన్నారు.

గంజాయి సాగుతో అనేక అనర్థాలు



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు గంజాయి సాగును విడిచిపెట్టి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. బుధవారం మండలంలోని చిన్నబరడ, చింతలూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ, గంజాయి వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఈ స్థితిలో గిరిజనులు వ్యవసాయ, ఉద్యాన పంటలను సాగు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలు, జాతీయ ఆహార భద్రత, ఈ-పంట, బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయం పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీటీసీ లోవరాజు పాల్గొన్నారు.

హుకుంపేటలో ఆశ్రమ పాఠశాల వార్డెన్‌కు షోకాజ్ నోటీసు

హుకుంపేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల1 వార్డెన్ పూర్ణరాజుకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ డీడీ రజిని తెలిపారు. ఈఆశ్రమ పాఠశాల-1 లో వార్డెన్ ఈనెల 5వతేదీన రాత్రి భోజనాల్లో విద్యార్థులకు క్యారెట్, ముల్లంగి కూరలు పెట్టాల్సి ఉండగా, బంగాళదుంప, పప్పు అందించారన్నారు. దీనిపై ఎస్ఎఫ్ఐ నేతలు ఫిర్యాదు మేరకు వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు డీడీ తెలిపారు.

అయ్యప్ప స్వాములు ఇరుముడులు



జోలాపుట్టులో స్వాములకు ఇరుముడులు కడుతున్న గురుస్వాములు

ముంచంగిపుట్టు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జోలాపుట్టు అయ్యప్ప స్వామి సేవా పీఠంలో బుధవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వామి మాలధరించి మండల కాల దీక్ష పూర్తయిన మొత్తం 120 మంది స్వాములు ప్రత్యేక బస్సులలో శబరిమలకు పయనమయ్యారు



బిర్సింగ్ గ్రామంలో వ్యాపారులు రవాణాకు సిద్ధం చేసిన నీలగిరి కలప



హుకుంపేటలో చెట్ల నరికివేత

గ్రామానికో 'పుష్ప'...తరలిపోతున్న కలప

- గ్రామాల్లో యథేచ్ఛగా చెట్ల నరికివేత
- అనుమతులు తక్కువ.. తరలింపు అధికం
- రాత్రివేళల్లోనే రవాణా
- అటవీ శాఖ ఉదాసీనం
- హుకుంపేటలో రెచ్చిపోతున్న అక్రమార్కులు

హుకుంపేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాలనుంచి విలువైన కలప అక్రమంగా తరలిపోతోంది.అయినా, అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటాలని, అడవులను సంరక్షించాలని ప్రకటనలు చేస్తోంది. అటవీ అధికారులు వీటి విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కడికక్కడ చెట్లను నరికి కలప తరలించుకుపోతున్నారు.దీంతో పర్యావరణానికి విఘాతం కలిగి కలుష్యం పెరిగిపోతోందనిపలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హుకుంపేట దాలిగుమ్మడి, భీమవరం పంచాయతీల్లో మదిపుట్టు, బిర్సింగ్ , చట్రాయిపుట్టు, తీయని పుట్టు, సంతరి తదితర ప్రాంతాల్లో కలపను అక్రమంగా తరలిస్తున్నారు. అయితే, రెవెన్యూ, అటవీశాఖ అనుమతులున్నట్టు వ్యాపారులు మభ్యపెడుతున్నారు. ఆయా ప్రదేశాల్లో నీలగిరి, ఇతర వృక్ష సంపదను తరలిస్తున్నట్టు ఆరోపణలు తరలిస్తున్నారు. ఫారెస్టు అధికారులు రాత్రి వేళల్లో కలప తరలించే సమయంలో ఉండటం లేదు. ఇదే అదనుగా వ్యాపారులు తమకున్న కొద్దిపాటి అనుమతి పత్రాలతో రెట్టింపు కలప తరలించుకుపోతున్నారు. నకిలీ పర్మిట్లతోనూ తరలిస్తున్నారు. ఈ దందా అంతా రాత్రివేళల్లోనే జరుపుతుండడం అనుమానాలకు తావిస్తోంది. పగటిపూట వీలున్నా తరలించడంపై ఆసక్తి చూపడంలేదరు. ఫారెస్టు చెక్ పోస్టుల వద్ద వ్యాపారులు తమకు అనుమతులున్నాయని చూపుతున్నారు. ఇందులో లోగుట్టు దాగి ఉంటుంది. ఇకనైనా అధికారులు పర్యావరణ దెబ్బ తికుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



రాత్రి సమయంలో వ్యాన్‌లో లోడ్ చేసిన కలప

ఉపాధి కూలీలకు వంద రోజులు పని కల్పన

పెదబయలు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 100 రోజులు ఉపాధి పని కల్పించాలని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యలయంలో వివిధ శాఖాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఉపాధి పథకం వీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లతో మాట్లాడారు. వేతనం రోజుకు రూ. రూ.300 గిట్టుబాటయ్యేలా చూడాలన్నారు. పనికి తగ్గట్టు కొలతలను ఇవ్వాలని ఆదేశించారు. అసంఘటిత కార్మికులను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని అన్నారు. దీనివల్ల ప్రమాద బీమా రూ. 2లక్షలు వస్తుందని పేర్కొన్నారు. అనంతరం పంచాయితీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడారు.మిస్సింగ్ సిటిజన్స్, మిస్సింగ్ ఎంప్లాయిస్ మ్యాపింగ్ పూర్తి చేయాలని అన్నారు. హౌస్ హోల్డ్, జియో ట్యాగింగ్ నమోదు చేయాలన్నారు. గ్రామ స్థాయిలో తాగు నీటి, పారిశుధ్య కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారుజ ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నరసింగరావు, ఏపీవో పెదప్పలనాయుడు, హౌసింగ్ ఏఈ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పెదబయలు:మాట్లాడుతున్న ఎంపీడీవో పూర్ణయ్య

చింతపల్లి: స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు బుధవారం మండల కేంద్రంలో క్లస్టర్ స్థాయి ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సమీక్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జూన్ నెలాఖరు వరకు ప్రతి ఉపాధి కూలీకి వంద రోజులు పనులు కల్పించాలన్నారు. గరిష్ఠంగా రూ.300 వేతనం అందించాలన్నారు. ఉపాధి పనులపై ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చేపల చెరువులు, నీటి కందకాలు, పంట కాలువలు, టెర్రసింగ్ ట్రెంచ్, గోకులాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ లోకేశ్, ఏపీవోలు రాంప్రసాద్, రాజు పాల్గొన్నారు.



భూ రీసర్వేపై జాకరవలసలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మాణిక్యం

రీ సర్వేకు సహకరించాలి: తహసీల్దార్

అనంతగిరి: భూ రీ సర్వేకు రైతులు సహకరించాలని, తహసీల్దార్ వి.మాణిక్యం అన్నారు. మండలంలోని టోకూరు పంచాయతీ జాకరవలస గ్రామంలో రీసర్వేపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భూ రీసర్వేకు సంబంధించి పైలట్ ప్రాజెక్టు కింద జాకరవలస ఎంపికైందన్నారు. రైతులు సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసుకుంటే.. రెవెన్యూ అధికారులు వచ్చి, రీసర్వే చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొస్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరులో ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

- డీఎల్‌పీవో పీఎస్ కుమార్

పాడేరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పాడేరులో ట్రాఫిక్ నియంత్రణకు వర్తకులు సహకరించాలని డీఎల్‌పీవో పీఎస్ కుమార్ కోరారు. బుధవారం పట్టణంలోని రోడ్డుకు ఇరువైపులా, ఇతర ప్రాంతాల్లోని వర్తకులతో మాట్లాడారు. రోడ్లపై వ్యాపారాలు సాగించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. అందువలన పాతబస్టాండ్ ఆవరణలోని చిరు వర్తకులకు రైతు బజార్‌లో కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారాలు నిర్వహించాలన్నారు. రోడ్డు పక్కన, పార్కింగ్ స్థలాల్లో వ్యాపారాలు చేయవద్దని సూచించారు. రైతు బజార్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానిక ఈవోఆర్‌డీ రమేశ్‌ను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



వర్తకులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో

గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం: ఎంపీపీ



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ బోయిన కుమారి తెలిపారు. బుధవారం మురగడపల్లిలో రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ కాసులమ్మతో కలిసి భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, నాయకులు పాల్గొన్నారు.

పెదబయలు: కిముడుపల్లి గ్రామంనుంచి సావడిమామిడి వరకు బీటీ రోడ్డు పనులను బుధవారం స్థానిక సర్పంచ్ శోభరాణి, ఎంపీటీసీ సభ్యులు కాసులమ్మ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతై 3.2 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 1.5 కోట్లు ఉపాధి నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు భీమరాజు, భూలోక, టీడీపీ నాయకులు నాగరాజు, కాం గ్రెస్ నాయకులు తమ్మన్న ,రామారావు, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభ, నాగరాజు, మల్లేశ్వరరావు, రాజు, అర్జున్‌స్వామి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు తరలిన కూటమి నాయకులు



బస్సులకు జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి తదితరులు

పాడేరు రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో బుధవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభకు పాడేరు నియోజకవర్గ పరిధిలోని పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు మండలాల నుంచి కూటమి నాయకులు 8 బస్సులలో భారీగా తరలివెళ్లారు. ఈ బస్సులకు పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాడేరు, అరకు నుంచి 16 బస్సులు

ప్రధాని మోదీ సభకు పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 16 బస్సులను కేటాయించినట్టు పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. పాడేరు నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు 8 బస్సులు, అరకు పరిధిలోని 6 మండలాలకు 8 బస్సులను కేటాయించామని ఆయన తెలిపారు.

బలిమెల నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర

సీలేరు, జనవరి 8, (ఆంధ్రజ్యోతి) : ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్ విశ్వనాథ్‌దాస్ తమిళనాడులోని కన్యాకుమారికి సైకిల్ యాత్ర పూర్తి చేశారు. గత నవంబరు 18వ తేదీన తన స్వగ్రామం నుంచి బయలు దేరి మార్గం మధ్యలో పలు దేవాలయాను దర్శించుకుంటూ కన్యాకుమారికి 25 రోజులకు చేరుకున్నట్టు ఆయన తెలిపారు. ఒడిశా మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎంవీ 36 గ్రామానికి చెందిన విశ్వనాథ్‌దాస్ బుధవారం తిరుగు ప్రయాణంలో జీకేవీధి మండలం ధారకొండ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కన్యాకుమారి వెళ్లి రావడానికి బుధవారానికి 50 రోజులు పూర్తయ్యాయని, మరో రెండు రోజుల్లో తమ గ్రామం బలిమెల ఎంవీ 36 చేరుకుంటానని ఆయన తెలిపారు.ఈ సారి ఉత్తర భారతదేశ యాత్ర చేస్తానని ఆయనచెప్పారు.



కన్యాకుమారినుంచి తిరుగు ప్రయాణంలో విశ్వనాథ్‌దాస్

సింహాచలం దేవస్థానానికి సరకులు పంపిణీ

హుకుంపేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట గ్రామానికి చెందిన కోరిబిల్లి కనక మహాలక్ష్మి కుంటుంబ సభ్యులు సింహచలం దేవస్థానానికి బుధవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా తాము భక్తులు నుంచి సహకారంతో ముక్కోటి ఏకాదశికి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. భక్తులకు తమ పేరుతో అన్న సంతర్పణ చేస్తారన్నారు.

కలెక్టర్ విస్తృత పర్యటన

- సుజనకోట, జోలాపుట్టు, డుడుమ పర్యాటక ప్రాంతాల సందర్శన
- మత్స్యగెడ్డ అందాలకు ఫిదా
- కేరళ తరహాలో పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వెల్లడి
- లబ్బూరి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ముంచంగిపుట్టు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ బుధవారం విస్తృతంగా పర్యటించారు. తొలుత సుజనకోట, జోలాపుట్టు, డుడుమ పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. డుడుమ జలపాతాన్ని సందర్శించి తిరిగి వెళుతూ లబ్బూరు గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల భవనాన్ని పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్బూరు పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు, మందులు నిల్వ ఉంచే గదిని తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. మాతా శిశు మరణాల నివారణపై అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

మండలంలోని సుజనకోట దరి మర్రిపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డను చూసిన కలెక్టర్ తన్మయత్వానికి గురయ్యారు. మత్స్యగెడ్డ సోయగాలు ఎంత చూసినా తనివి తీరడం లేదని, ఈ ప్రాంతాన్ని కేరళ తరహాలో పర్యాటకపరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. మత్స్యగెడ్డపై బోటు షికారు, కాటేజీల నిర్మాణాలకు అనువైన స్థలం, వ్యూపాయింట్‌లు వంటి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. అంతకు ముందు జోలాపుట్టు ఇంగ్లీషు మీడియం పాఠశాలలను సందర్శించి,విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి జవాబు రాబట్టారు. డుడుమ జలపాతం, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీసాయిహర్ష, పీఆర్ ఏఈ గోపాలక్రిష్ణ, ఆర్‌ఐ రవికుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, తదితరులు ఉన్నారు.



లబ్బూరు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించాలి

- కేంద్ర మంత్రికి జడ్పీ చైర్‌పర్సన్ వినతి



కేంద్ర మంత్రి దుర్గాదాస్ ఉయికేతో జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర గిరిజన వ్యవహారా లశాఖ మంత్రి దుర్గాదాస్ ఉయికేకి వినతి పత్రం అందజేసినట్టు జడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర,చింతపల్లి ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. పంచాయతీలనుంచి పార్లమెంట్ సెమినార్‌కి వె ళ్లిన వారు రాజ్‌భవన్‌లో కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ స్థానిక విలేకరులకు ఆ వివరాలందించారు. ప్రధానంగా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో జీవో 3 అమలులో ఉన్న సమయంలో ఉపాధ్యాయ, ఇతర ఉద్యోగాల భర్తీ లో షెడ్యుల్డ్ ప్రాంతాల్లో శతశాతం ఆదివాసీ యువతకు రిజర్వేషన్ కల్పించినట్టు చెప్పారు. మూడేళ్ల క్రితం జీవో 3ను రద్దు చేయడంతో యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నట్టు మంత్రికి వివరించారు. ఈ స్థితిలోఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్‌కు ప్రత్యామ్నాయ చట్టం తీసుకురావాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టులతో ఆదివాసీల జీవనం అస్తవ్యస్తం

- గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

చింతపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్టుల అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఈ మేరకు నాయకులు ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పడాల్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాలో చింతపల్లి, అనంతగిరి, దేవరాపల్లి మండలాల్లో అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీలకు హైడ్రో పవర్ ప్రాజెక్టులను అప్పగిస్తూ అనుమతించిందన్నారు. వీటి వల్ల గిరిజన గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు. ఆదివాసీలు జీవనోపాధి కోల్పోతారన్నారు. ఈ స్థితిలో తక్షణమే వీటిని రద్దు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్, మండల నాయకుడు సాగిన చిరంజీవి పడాల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణింపుతో భవిష్యత్తు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విద్యాభారతి, పీడీ శివరామ్ కుమార్

చింతపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. బుధవారం కళాశాల మైదానంలో విశాఖపట్నం నెహ్రూ యువజ కేంద్రం అధికారులు ఏర్పాటు చేసిన బ్లాక్ స్థాయి క్రీడలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. వాలీబాల్, త్రోబాల్, లాంగ్ జంప్, హైజంప్, వన్‌కే రన్ పోటీలను ఫిజికల్ డైరెక్టర్ శివరామ్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. విజేతలకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ ఆర్ఎస్ దొర బహుమతులందజేశారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస పాత్రుడు, డాక్టర్ రమణ, డాక్టర్ కేజియా, సంతోషి, లీలాపావని, రవీంద్రనాయక్, జగదీశ్, జగత్‌రాయి, పీడీ శివరామ్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో అధ్యాపకులు, విద్యార్థులు

పాడేరురూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి సం క్రాంతి విశిష్టతను వివరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, ఫుడ్ షిప్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు, అధ్యాపకులు రమేష్, అప్పలనాయుడు, కొత్తంనాయుడు, గౌరీశంకరరావు, శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. దేవాపురంలో గిరిజన ఆచారం ప్రకారంసంక్రాంతి పండగను ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, గిరిజన సంప్రదాయ థింసా నృత్యం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామ పెద్దలు కిముడు కొండబాబు, కిల్లు పరమేష్, అల్లంగి భీమరాజు, కోరాబు కృష్ణంనాయుడు, కె.భీమ్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే విద్యా ప్రమాణాలు పెంచాలి

అరకులోయ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):ప్రాథమిక స్థాయి నుంచే విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ స్వామినాయుడు అన్నారు. స్థానిక ఓ రిసార్ట్‌లో బుధవారం జరిగిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమంలోని ఆయన పాల్గొని, మాట్లాడారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో బోధన జరగాలని సూచించారు.. ప్రాథమిక స్థాయి నుంచే వారి భవిష్యత్తుకు పునాది వేయాలని కోరారు. కార్యక్రమంలోని ఏఎంవో భాస్కరరావు, ఎంఈవో భారతిరత్నం, జిల్లా కోఆర్డినేటర్ వెంకన్న, సీఎంవో ప్రకాశ్, ఏపీవో పాత్రుడు, జీసీడీవో సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ స్వామినాయుడు

ప్రధాని పర్యటనలో నాయకుల నిర్బంధం అన్యాయం: సీపీఎం

పాడేరురూరల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బుధవారం విశాఖ పర్యటన నేపథ్యంలో సీపీఎం నాయకులను అక్రమ నిర్బంధించడాన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధానిపర్యటన నేపథ్యంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలను మంగళవారం నుంచి గృహ నిర్బంధం, అక్రమ అరెస్టు చేసినట్టు ఆరోపించారు. బుధవారంబల్క్‌డ్రగ్స్ పార్క్ నక్కపల్లిలో ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంతంలో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులనూ అన్యాయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కా కుండా ప్రధాన మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేయడమే తప్పా అని ఆయన ప్రశ్నించారు.

గిరిజనులకు రగ్గులు పంపిణీ

చింతపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరధి లంబసింగి పంచాయతీలో గిరిజనులకు రగ్గులు పంపిణీ చేసినట్టు నర్సీపట్నం శాన్ (ఎస్ఏఎన్) చారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సూరిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. బుధవారం లంబసింగి పంచాయతీ పరిధి చెరువులేవనం, బంతిబయలు, రింగుడుమెట్ట, భీమనాపల్లి, చీకటిమామిడి, టేకులబంద, వాడగడ్డ గ్రామాల్లో 450 గిరిజన కుటుంబాలకు రగ్గులను అందజేశారు. ఈ రగ్గులను తిరుపతికి చెందిన పీపుల్ చారిటీ ఆర్థిక సహాయంతో అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో లంబసింగి మాజీ సర్పంచ్ కొర్ర రఘునాథ్, గ్రామ పెద్దలు నూక రాజు, సరమండ నాగరాజు పాల్గొన్నారు.


రింగు రోడ్డు నుంచి బస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కొణతాల

ప్రధాని సభకు తరలిన జనం

అనకాపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో బుధవారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణం నుంచి అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు, కూటమి నాయకులు బయలుదేరారు. రింగు రోడ్డులో కార్యకర్తలతో వెళ్తున్న బస్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రారంభించారు. అలాగే ఎన్టీఆర్ స్టేడియం, సంతబయలు, రింగురోడ్డు, పరమేశ్వరి పార్కు జంక్షన్లలో జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన బస్సుల్లో డ్వాక్రా మహిళలు, ఆర్పీలు, సచివాలయ సిబ్బంది భారీగా తరలివెళ్లారు. అనకాపల్లి నుంచి వెళ్లే వారి కోసం అధికారులు అమలాపురం డిపో నుంచి వచ్చిన బస్సులను అందుబాటులో ఉంచడంతో ఉదయం పదిన్నర గంటల సమయంలో ఇటు కూటమి నాయకులు, అటు డ్వాక్రా మహిళలు ప్రధాని సభకు 28 బస్సుల్లో తరలివెళ్లారు.

పరవాడ నుంచి 102 బస్సుల్లో...

పరవాడ: విశాఖ ఏయూ ప్రాంగణంలో బుధవారం నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు మండలం నలుమూలల నుంచి కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. అన్ని పంచాయతీల నుంచి 102 బస్సుల్లో డ్వాక్రా మహిళలు, కూటమి కార్యకర్తలు, బీజేపీ అభిమానులు తరలివెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. అలాగే కూటమి నాయకులు కార్లులో ర్యాలీగా సభకు బయలుదేరారు.

సబ్బవరం నుంచి 150 బస్సుల్లో...

సబ్బవరం: ప్రధానమంత్రి సభకు సబ్బవరం మండలంలో పలు గ్రామాల నుంచి ప్రజలు, కూటమి నేతలు 150 బస్సుల్లో తరలివెళ్లారు. కూటమి నేతలు బరణికాన బాబూరావు, పిబివిఎస్ఎన్ రాజు, గండి దేముడు, బొండా సత్యారావు, సాలాపు వెంకటేశ్వరరావు, దొడ్డి ప్రకాశ్, ఇందలి రమణ, దాసరి రమణ, గవర అప్పారావు, దుర్గినాయుడు, కన్నంనాయుడు, ఆడారి నాగరాజు, కొటాన అప్పారావు, గండి ముత్యాలనాయుడు, రామకృష్ణరాజు, బర్ల రమణ, పల్ల తాతారావు, కర్రి నరసింగరావు, పడాల శ్రీను, ఆకుల గణేశ్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ, సమన్వయ కమిటీ సభ్యులు సభకు కార్లలో వెళ్లారు.

కశింకోట నుంచి 140 బస్సుల్లో...

కశింకోట: ప్రధానమంత్రి మోదీ బహిరంగ సభకు మండలంలోని 26 పంచాయతీల నుంచి సుమారు 140 ఆర్టీసీ బస్సుల్లో ప్రజలు, అభిమానులు, కూటమి కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ బస్సులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, పార్టీ నేత బుదిరెడ్డి చిన్న జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుభాషిణి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్, కూటమి నేతలు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీశ్, తాకాశి కృష్ణ, దాసరి బాబు, వేగి కోటి, పెంటకోట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందారుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరించిన ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్

అనకాపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్థక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో రాష్ట్ర గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం 2025 క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. పశు సంవర్థక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్, డైరెక్టర్ డాక్టర్ టి.దామోదరనాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రజినీకుమారి ఈ క్యాలెంటర్‌ను ఆవిష్కరించారని సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం మండల కార్యవర్గం


ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులు

అనకాపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయరామరాజుపేట యాదవ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా బొబ్బిలి అప్పారావు, అధ్యక్షుడిగా భర్నికాన గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వాయిబోయిన చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా ముగడ అప్పారావు, కార్యదర్శిగా బొబ్బిలి రామారావు, సహాయ కార్యదర్శిగా కుండల రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బొబ్బిలి సాంబమూర్తి, భర్నికాన నూకరాజు, కోశాధికారిగా భర్నికాన శ్రీనివాసరావు, ముఖ్య సలహాదారునిగా బొట్టా చిన్ని ఎన్నికయ్యారు. వీరితో పాటు మరో 13 మంది కమిటీ సభ్యులు, నలుగురు గౌరవ సభ్యులను ఎన్నుకున్నారు. వీరిని సంఘ పెద్దలు అభినందించి శాలువాలతో సత్కరించారు.

ఏఎంఏఏ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


హరిదాసులు, సంప్రదాయ వేషధారణల్లో ఉన్న విద్యార్థులు

కొత్తూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఎంఏఏ హైస్కూలులో బుధవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. వంటల పోటీలు, ముగ్గుల పోటీలు, గాలిపటం పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగ పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. కాగా ఈ పోటీల్లో విజేతలకు వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు), తమ్మన రఘుబాబు ముఖ్య అతిథిగా పాల్గొని బహుమతులు అందజేవారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోరిబిల్లి లావణ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం.. అధ్వానం!

వాడచీపురుపల్లిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

- వీధుల్లో ఎక్కడికక్కడే చెత్త కుప్పలు
- ఈగలు, దోమల స్వైరవిహారం
- రోగాల భయంతో వణుకుతున్న ప్రజలు

పరవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి గ్రామంలో పారిశుధ్య సమస్య తాండవిస్తోంది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. దీని కారణంగా పరిసర ప్రాంతాలన్నీ పరమ అధ్వానంగా తయారవుతున్నాయి. రోజురోజుకూ వ్యర్థాలు ఎక్కువైపోతున్నా పట్టించుకునే నాథులే లేరని స్థానిక ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో వాడి పారేసిన పాలిథిన్ కవర్లు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక సామాజిక భవనం సమీపంలో ఎక్కువగా వ్యర్థాలు కుప్పల మాదిరిగా కనబడుతున్నాయి. స్థానిక ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని వ్యర్థాలు పారబోయిడంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. గ్రామానికి రాకపోకలు సాగించే ప్రధాన రహదారికి ఆనుకొని చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీటిని కుక్కలు చిందర వందర చేయడం, రోజుల తరబడి తరలించకపోవడంతో దుర్గంధం వెలువడి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది రాత్రులు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. అలాగే ఎప్పుడు ఏ రోగం సోకుతుందోనని భయం భయంగా ఉంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


వాడచీపురుపల్లి సామాజిక భవనం వద్ద చెత్త కుప్ప


ప్రధాన రహదారికి ఆనుకొని దర్శనమిస్తున్న చెత్త

ప్రధాని సభకు బస్సులు.. ప్రయాణికుల పాట్లు



అనకాపల్లి కాంప్లెక్స్ బయట బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు... కాంప్లెక్స్‌లో కూర్చొన్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంలోని పీటీడీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ప్రయాణికులు పడరాని పాట్లు పడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ పర్యటనకు వస్తున్న సందర్భంగా అనకాపల్లి డిపోలో ఉన్న 100 బస్సుల్లో 70 బస్సులు కె.కోటపాడు, సబ్బవరం మండలాల నుంచి జనాలను తరలించేందుకు పంపేయడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పలేదు. తెల్లవారు జాము నుంచి చీకటిపడే వరకు బస్సుల కోసం ప్రయాణికులు ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అనకాపల్లి డిపో నుంచి విశాఖకు వెళ్లాల్సిన బస్సులు ఆరు, విజయనగరం నాలుగు, నర్సీపట్నం నాలుగు, చోడవరం రెండు, పాయకరావుపేట ఐదు, దేవరాపల్లి మూడు, మాడుగుల రెండు, సింధియా రెండు, తగరపువలస రెండు, జోలాపూట్ ఒకటి, పలాస రెండు బస్సులతో పాటు వివిధ మార్గాల్లో వెళ్లే బస్సులను సైతం అధికారులు నిలిపివేసి ప్రధాని సభకు బస్సులు కేటాయించడం వల్ల ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. కాంప్లెక్స్ నుంచి పరిసర గ్రామాల ప్రయాణికులు సైతం విశాఖ, విజయనగరం, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం, పాయకరావుపేట, ఎలమంచిలి, రాంబిల్లి, పూడిమడక, రావికమతం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతాలకు వెళ్లే బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఎక్కువ సేపు బస్సుల కోసం పిల్లలతో సహా నిరీక్షించాల్సి వచ్చింది. వేకువజామునే డిపో నుంచి బస్సులు కోటపాడు, సబ్బవరం మండలాలకు వెళ్లిపోయాయి. ఉన్న 30 బస్సుల తోటే ఏదో నడపామన్న చందంగా బస్సులు నడిపారే తప్ప ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణం కల్పించడం లేదని పలువురు వాపోయారు. కాంప్లెక్స్‌కు బస్ వస్తే అప్పటి వరకు వేచి ఉన్న ప్రయాణికులు తోపులాటలతో మరీ బస్సుల్లోకి ఎక్కి కిక్కిరిసిపోయి తప్పనిసరి పరిస్థితుల్లో స్వగ్రామాలకు ప్రయాణం సాగించాల్సి వచ్చింది. ఏదేమైనా వీవీపీలు జిల్లా, పక్క జిల్లాకు వచ్చినట్లయితే అనకాపల్లి కాంప్లెక్స్ నుంచి ప్రయాణం సాగించడం కష్టతరమవుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సీపీఎం నేతల నిర్బంధాలకు నిరసనగా రాస్తారోకో


పట్టణంలోని పాత బాటా సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ పర్యటన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సీపీఎం నాయకులను అరెస్టులు చేసి గృహ నిర్బంధం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం సీపీఎం నాయకులు ఆందోళన చేపట్టారు. మెయిన్ రోడ్డులోని పాత బాటా సెంటర్ వద్ద రాస్తారోకో చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల ముందు అక్రమ అరెస్టులు ఉండవని ప్రకటించిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చాక అక్రమంగా అరెస్టు చేయడం తగదని పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఇప్పటికైనా ఇటువంటి దుందుడుకు చర్యలను విడనాడాలని, లేదంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడి ఇనుపగనులు కేటాయింపులో ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని, నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయడం లేదని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, ఉమా మహేశ్వరరావు, తేలయ్యబాబు, బీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఎంపీ కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభించిన దాడి జయవీర్

అనకాపల్లి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపీ సీఎం రమేశ్ సొంత నిధులతో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సీఎం రమేశ్ కప్ క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను టీడీపీ నాయకుడు దాడి జయవీర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జయవీర్ మాట్లాడుతూ ఏడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేత జట్టుకు రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్, క్రికెట్ క్రీడాకారులు సతీశ్, జగదీశ్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక, రైతు సంఘాల నాయకుల అరెస్టు దుర్మార్గం'

పరవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ జిల్లా పర్యటన నేపథ్యంలో కార్మిక, రైతు, ప్రజా సంఘాల నాయకులను అరెస్టు చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ధ్వజమెత్తారు. అరెస్టులు, గృహ నిర్బంధాలను నిరసిస్తూ బుధవారం ఫార్మాసిటీలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా మోదీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పరిశ్రమను స్థాపించవద్దన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.పోతినాయుడు, పి.చిన్నారావు, సత్తిబాబు, వై.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ఫార్మాసిటీలో ర్యాలీ చేపడుతున్న సీఐటీయూ ప్రతినిధులు

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవికుమార్


పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

సబ్బవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పడాల రవికుమార్ ఆదేశించారు. సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించిన రికార్డులు, పీహెచ్‌సీ రికార్డులు పరిశీలించారు. గర్భిణులు, చిన్నపిల్లల నమోదు ప్రక్రియను పరిశీలించి శతశాతం జరగాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. క్యాన్సర్ సర్వే (ఎన్‌సీడీ), ఆర్‌బీఎస్‌కే సర్వేలను పరిశీలించారు. వ్యాక్సిన్ నిల్వ ఉంచే ఐఎల్ఆర్ డీప్రెజర్‌ను, టెంపరేచర్ చార్టుతో పాటు కొత్త భవనంలో ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను కూడా ఆయన పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరతపై ఆరా తీశారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ఎన్ఆర్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు


పైడివాడ అగ్రహారంలో సర్వే రాళ్లపై జగన్ పేరు తొలగిస్తున్న దృశ్యం

సబ్బవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రీ సర్వే కార్యక్రమంలో భాగంగా పొలాల సరిహద్దుల్లో పాతిన రాళ్లపై అప్పటి సీఎం జగన్ బొమ్మ, పేర్ల తొలగింపు కార్యక్రమం మండలంలో జోరుగా జరుగుతున్నదని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. సబ్బవరం మండలంలో 20 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లోని రైతుల పొలాల సరిహద్దులో పాతడానికి మండలానికి 25,177 సర్వే రాళ్లను మండలానికి కేటాయించి, పొలాల సరిహద్దుల్లో అమర్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం బొమ్మ, పేర్ల తొలగింపు కార్యక్రమం చేపట్టింది. మండలంలో పైడివాడఅగ్రహారం, అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, ఇరువాడ, సబ్బవరం, గాలిబీమవరం, నారపాడు గ్రామాల్లో సుమారు ఎనిమిది వేల రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లు తొలగింపు పూర్తియినట్టు తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు.

సీపీఐ నాయకులను నిర్బంధించడం దారుణం

- పార్టీ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం

తుమ్మపాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బహిరంగ సభను అడ్డుకుంటారన్న నెపంతో సీపీఐ నాయకులను గృహ నిర్బంధాలు చేయడం దారుణమని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం ఆరోపించారు. బుధవారం తన నివాసం వద్ద పోలీసుల పర్యవేక్షణలో నిర్బంధించడంపై ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర జ్వరంతో బాధపడుతున్నప్పటికీ విచక్షణ లేకుండా పోలీసులు దౌర్జన్యంగా గృహ నిర్బంధం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వ ఏకపక్ష పాలనకు ఇదే నిదర్శనమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ తీరును మార్చుకోకుంటే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.

ఇంటర్వ్యూ..

సరకు రవాణాలో అనకాపల్లి డిపో టాప్

-కె.పద్మావతి, డీపీటీవో



అనకాపల్లి నుంచి గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలే ఎక్కువగా ఉన్నారు. విశాఖ నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అనకాపల్లి మీదుగా వెళ్తున్నాయి. సరకు రవాణాలో డిపో టాప్‌లో ఉంది.

ప్ర: అనకాపల్లి డిపో నుంచి దూర ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఎందుకు నడపడం లేదు?

జ: అనకాపల్లి డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య తక్కువ. అయినా అనకాపల్లి నుంచి కాకినాడకు ఎక్స్‌ప్రెస్ బస్ ప్రవేశపెట్టాం. ఓఆర్ అంతగా రాలేదు. అనకాపల్లి కాంప్లెక్స్ నుంచి గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణించే ప్రజలే ఎక్కువగా ఉంటున్నారు. విశాఖ నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు అనకాపల్లి మీదుగా వెళ్తున్నాయి.

ప్ర: అనకాపల్లి నుంచి కొత్త రూట్లు ఏమైనా వేస్తారా?

జ: దీనిపై ఏమీ నిర్ణయించలేదు. ప్రభుత్వం కొత్త బస్సులను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. కొత్త బస్సులు వస్తే పరిశీలన చేస్తాం.

ప్ర: అనకాపల్లి నుంచి ఆర్‌కే బీచ్‌కు బస్ సౌకర్యం ఎందుకు కల్పించడం లేదు?

జ: అనకాపల్లి నుంచి కేజీహెచ్, ఆర్‌కే బీచ్‌కు వెళ్లే ప్రయాణికులు పెద్దగా ఉండరు. ఒకవేళ బస్ వేసినా డిపోకు ఆశించిన మేరకు ఆదాయం రాదు. అలా బస్ వేస్తే అనకాపల్లి-విశాఖ మధ్య ఒక ట్రిప్ పోతుంది. అనకాపల్లి వాసులు విశాఖలో దిగిన వెంటనే అడుగడుగునా ఆర్‌కే బీచ్‌కు, కేజీహెచ్‌కు బస్సులు అందుబాటులో ఉంటాయి.

ప్ర: సరకు రవాణా ఆదాయం ఎలా ఉంది?

జ: అనకాపల్లి పీటీడీ డిపో నుంచి సరకు రవాణా బాగానే ఉంది. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది కూడా ఆశించిన మేరకు లక్ష్యాలను సాధించగలుగుతున్నాం. గత ఏడాది ఇదే సమయానికి రూ.కోటి 60 లక్షలు సరకు రవాణా ద్వారా లభించింది. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.కోటి 61 లక్షల వచ్చింది. సరకు రవాణాలో అనకాపల్లి డిపో టాప్‌లో ఉంది.

-అనకాపల్లి టౌన్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పరవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. పరవాడ, వెన్నెలపాలెం, బొద్దపువానిపాలెం, రావాడ, భరిణికం, మూలస్వయంభూవరం, గొర్లెవానిపాలెం, పి.బోనంగి, దేశపాత్రునిపాలెం, ఈ.బోనంగి పంచాయతీల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని ఆయా గ్రామాల వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

సబ్బవరంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు

సబ్బవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత 43 రోజులుగా జరుగుతున్న గ్రామ రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. పైడివాడ అగ్రహారంలో జరిగిన ముగింపు సభలో వెలుగు శాఖ సర్వేయర్ రాంబాబు రైతులు నుంచి అర్జీలు స్వీకరించారు. ఇదిలా ఉండగా బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు జనాలను తరలించే ఏర్పాట్లులో రెవెన్యూ అధికారులు ఉండడంతో, చివరి సదస్సు మొక్కుబడిగా సాగింది. జనాలను తరలించి సదస్సుకు వచ్చిన అధికారులు రైతులు పెద్దగా లేకపోవడంతో వెనుదిరిగారు. రెవెన్యూ సమస్యలపై ఎప్పుడు కార్యాలయానికి వచ్చి వినతులు అందించినా స్వీకరించి పరిష్కరిస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, మాజీ సర్పంచ్ బొబ్బరి కన్నారావు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.


దేమునిగుమ్మం శ్రీవారి ఆలయంలో ఏకాదశి ఏర్పాట్లు

అనకాపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక దేమునిగుమ్మం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం జరగనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను కూటమి నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, సకల గోవింద, దూలం గోపి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముక్కోటి ఏకాదశి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ ఈవో టి.రాజసులోచన మాట్లాడుతూ శుక్రవారం తెల్లవారు జామున 2.30 గంటలకు స్వామివారికి సుప్రభాతసేవ, నిత్యార్చన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం మీదుగా అయోధ్య బాలరాముడు దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పులఖండం గిరిబాబు, ప్రసాద్ బాబు, జగన్నాథస్వామి ఆలయ చైర్మన్ దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మోదీకి బ్రహ్మరథం

భారీగా తరలివచ్చిన జనం

▸ రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం.. పక్కన లోకేశ్


వేదికపై ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం


సభకు హాజరవుతున్న ప్రజలు

- ▸ పూలవర్షం కురిపించిన అభిమానులు
- ▸ కిక్కిరిసిన సభా ప్రాంగణం
- ▸ ప్రధాని ప్రసంగానికి కేరింతలు, చప్పట్లు
- ▸ మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్ ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. సభా వేదిక వరకూ రహదారులు జనంతో నిండిపోయాయి. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మధ్యాహ్నం మూడు గంటల నుంచే వివిధ ప్రాంతాల నుంచి కూటమి పార్టీల అభిమానులు, నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో మైదానం నిండిపోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. ఊహించిన దానికన్నా సభ విజయవంతం కావడంతో కూటమి పార్టీల నాయకుల్లో కొత్త ఉత్సాహం తొణికిసలాడింది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ప్రధాని సభకు బస్సుల్లో తరలివచ్చిన ప్రజలు


ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కరచాలనం


సభకు హాజరైన వారిని తనిఖీ చేస్తున్న పోలీసులు


ప్రధాని మోదీని దుశ్శాలువతో సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు


వేదికపై ఎంపీ సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి


బహిరంగ సభకు తరలివస్తున్న మహిళలు


వేదికపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, అనిత



విశాఖ విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, ఎంపీ పురందేశ్వరి ఉన్నారు.

వరల్డ్ కప్ ఖోఖో పోటీలకు రిఫరీగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

తుమ్మపాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్న మొట్టమొదటి వరల్డ్ కప్ ఖోఖో పోటీలకు రిఫరీగా తుమ్మపాల గ్రామానికి చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్‌ఎల్‌ఎం శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఇతను కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసరావును ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు దాడి జయవీర్, ఆంధ్రా ఖోఖో అసోసియేషన్ ప్యాట్రన్ దాడి రత్నాకర్, విశాఖ జిల్లా ఖోఖో అసోసియేషన్ చైర్మన్ దాడి వీరభద్రరావు, తదితరులు అభినందించారు.

విశాఖకు నవోదయం

... 5వ పేజీ తరువాయి

గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లు ఏర్పాటు కానున్నాయని, వాటిలో ఒకటి విశాఖపట్నమన్నారు. భవిష్యత్తులో హైడ్రోజన్ గ్రీన్ ఎనర్జీ ద్వారా ఏపీలో పెట్టుబడులు, తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రధాని వివరించారు. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుతో మౌలిక వసతులు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. దేశంలో మూడు చోట్ల బల్క్ డ్రగ్ పార్కులు ఏర్పాటుచేయనుండగా అందులో ఒకటి నక్కపల్లిలో వస్తోందన్నారు.

దశ మార్చనున్న నీలి విప్లవం

సముద్ర వ్యాపారంలో శతాబ్దాల చరిత్ర గల విశాఖపట్నం నీలి విప్లవంతో మరోసారి తన ప్రాభవాన్ని చాటనుందని, ఇందులో భాగంగా విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌ను ఆధునీకీకరిస్తున్నామని ప్రధాని వివరించారు. దశాబ్దాలుగా విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కోసం పోరాడిన ఇక్కడి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జోన్ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేశామని, తద్వారా ఏళ్ల నాటి కలను సాకారం చేశామన్నారు. కాగా, విశాఖను ఆర్థిక రాజధానిగా మరింత బలోపేతం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. ప్రపంచానికి అరకు కాఫీని పరిచయం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కుతుందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుతో ఐటీ, ఫార్మా, టూరిజం అభివృద్ధి చెందుతాయని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్రం ఆర్థికంగా బలోపేతమవుతుందని చంద్రబాబు వివరించారు.

కూటమితో పారిశ్రామికవేత్తలకు భరోసా

▸ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్


సభలో మాట్లాడుతున్న ఎంపీ సీఎం రమేశ్

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం ద్వారా బలమైన పాలన సాధ్యమైందని, దీనివల్ల రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలకు భరోసా లభించిందని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు. ఏయూలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. వైసీపీ విధ్వంస పాలనతో రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై కారుమబ్బులు కమ్ముకున్నాయన్నారు. ఎంతో మంది పారిశ్రామికవేత్తలను భయపెట్టి తరిమేశారన్నారు. రాష్ట్రంలో కొత్తవెలుగులు రానున్నాయని, దీనికి నిదర్శనమే రెండు లక్షల కోట్ల పెట్టుబడులన్నారు. దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రధాని నరేంద్రమోదీ ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే పెట్టుబడులను అనకాల్లి నియోజకవర్గంలో పెడుతుండడంతో తన జన్మ ధన్యమైందన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాభివృద్ధికి దోహదం చేసే మరిన్ని తీపి కబుర్లు వింటామన్నారు.

యూనిటీ మాల్‌తో చేనేతకు ఊతం

▸ రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి సవిత


యూనిటీమాల్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి

విశాఖపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యూనిటీ మాల్ నిర్మాణం వల్ల చేనేత, హస్త కళా ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కలగడంతోపాటు చేనేత కళాకారులకు ఆర్థిక భరోసా లభిస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖా మంత్రి ఎస్.సవిత తెలిపారు. భీమిలి బీచ్‌రోడ్డులో తిమ్మాపురం వద్ద యూనిటీ మాల్‌కు కేటాయించిన స్థలాన్ని బుధవారం చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణితో కలిసి పరిశీలించారు. రూ.172 కోట్లతో చేపడుతున్న నిర్మాణ ప్లాన్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జీ+4గా నిర్మించే భవనంలో మొదటి రెండు అంతస్థుల్లో 62 షాపులు, మూడో అంతస్థును సీవ్యూగా తీర్చిదిద్ది రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగో అంతస్థులో కన్వెన్షన్ హాలుతో పాటు రెండు మినీ థియేటర్లు, రిటైల్ స్టోర్లు, రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఒకే భవనంలో వ్యాపారం, వినోదం లభించేలా ప్లాన్ రూపొందించామన్నారు.

ఉత్తర ద్వార దర్శనం రేపు

▸ వైకుంఠ ఏకాదశికి ముస్తాబైన అప్పన్న ఆలయం

సింహాచలం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి ఉత్సవానికి ముస్తాబయింది. శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి 10.30 గంటల వరకూ వైకుంఠ నారాయణుడి అలంకారంలో ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి వేలాదిగా భక్తులు తరలిస్తారు. దీంతో అధికారులు ఉత్తర ద్వారం ఎదురుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి భక్తులను ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి అనుమతిస్తారు.

అడ్డదారి గురువులపై యాక్షన్

... 5వ పేజీ తరువాయి

నమోదు చేసుకున్నట్టు ఫిర్యాదులు రావడంతో మండల విద్యా శాఖ అధికారులు స్పందించారు. కసిరెడ్డిపాలెం పాఠశాలలో ఒక విద్యార్థి, జగ్గంపేట పాఠశాలలో ఇద్దరు, భోగాపురం పాఠశాలలో ఒక విద్యార్థి.. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నట్టు గుర్తించారు దీంతో ఆన్‌లైన్‌లో వారి పేర్లను తొలగించారు. అయితే ఇందుకు బాధ్యులైన ఉపాధ్యాయులకు ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

క్రైం... crime news

ట్రాక్టర్‌లో గంజాయి రవాణా

▸ స్వాధీనం చేసుకున్న చోడవరం పోలీసులు


ట్రాక్టర్‌లో గంజాయి ప్యాకెట్లు

చోడవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్‌లో ఇసుక బస్తాల మాటున తరలిస్తున్న గంజాయిని బుధవారం సాయంత్రం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి ట్రాక్టర్‌లో గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం అందడంతో చోడవరం పోలీసులు ఇక్కడ ప్రధాన రహదారిపై మాటు వేశారు. పాడేరు వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి తనిఖీ చేశారు. గంజాయిని, ఇసుకను వేర్వేరుగా చిన్నపాటి సంచుల్లో ప్యాకింగ్ చేసి తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా పెదబయలు ప్రాంతానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గంజాయితో సహా ట్రాక్టర్‌ను, నిందితులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ప్రధాని నరేంద్ర మోదీ విశాఖ పర్యటన సందర్భంగా స్థానిక పోలీసు అధికారులు బందోబస్తుకు వెళ్లడంతో గంజాయి, నిందితుల వివరాలను గురువారం పంచనామా నిర్వహించి వెల్లడిస్తామని తెలిపారు.

వేములపూడి కేజీబీవీలో ఫుడ్ పాయిజన్

▸ 18 మంది విద్యార్థినులకు అస్వస్థత


ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తనూజను పరామర్శిస్తున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపూడిలో వున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 18 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు అవుతుండడంతో స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. మంగళవారం ఉదయం విద్యార్థినులకు అల్పాహారంగా పులిహోర పెట్టారు. తిన్న తర్వాత పిండి తనూజ, తేజస్వినిలకు వాంతులు, విరేచనాలు అయ్యాయి. బుధవారం ఉదయం అల్పాహారంగా కిచిడి తిన్న తర్వాత ఎనిమిదో తరగతి విద్యార్థినులు కె.హేమలత, ఎస్.నవ్యశ్రీ, హేమఅమృత హర్షిత, ఇంటర్ విద్యార్థిని వి.కాత్యాయినికి విరేచనాలు, వాంతులు అవుతుండడంతో పీహెచ్‌సీకి తరలించారు. విద్యార్థినులకు డాక్టర్ అనుష వైద్య సేవలు అందించారు. వీరిలో పిండి తనూజ కోలుకుందని భావించిన ప్రిన్సిపాల్.. ఆమె తల్లిదండ్రులకు కబురుపెట్టి సొంత ఊరుకి పంపించారు. అయితే ఇంటికి వెళ్లిన తర్వాత తనూజ బాగా నీరసపడడంతో తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. విషయం తెలుసుకున్న ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర ఆస్పత్రికి వచ్చి బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం కోసం నలుగురు విద్యార్థినులను ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎంఈవో తలుపులు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519